ఉష్ణోగ్రత సమాచారం (గరిష్ఠం)

హిందూపురం	36.0
పెనుకొండ	38.0
మడకశిర	36.0

క్లుప్తంగా

రేపటి నుంచి ఆంజనేయస్వామి ఉత్సవాలు



అలంకరణలో ఆంజనేయస్వామి

మడకశిరరూరల్: మండలంలోని చందకచర్లలో ఈ నెల 13 నుంచి 15వ తేదీ వరకూ ఆంజనేయస్వామి ఉత్సవాలు నిర్వహించనున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు. 13న సీతారాముల కల్యాణోత్సవం, 14న హనుమాన్ జయంతి, జ్యోతుల ఉత్సవం, మధ్యాహ్నం స్వామి బ్రహ్మరథోత్సవం, 15న స్వామికి పంచామృతాభిషేకం, మహా మంగళహారతి తదితర పూజా కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలన్నారు.

'వైఎస్సార్ యంత్రసేవ' రైతులకు వరం



ట్రాక్టర్, యంత్రాలను పరిశీలిస్తున్న ఏడీఏ అల్తాఫ్ అలీఖాన్, ఏఓ విజయభారతి

పరిగి: వైఎస్సార్ యంత్రసేవ పథకం రైతుల పాలిట వరమని వ్యవసాయ సహాయ సంచాలకుడు అల్తాఫ్ అలీఖాన్, ఏఓ విజయభారతి తెలిపారు. కస్టమ్ హైరింగ్ సెంటర్ పథకంలో భాగంగా హొన్నంపల్లి రైతు భరోసా కేంద్రం పరిధిలో ఉన్న యువజన గ్రామిక రైతు సంఘానికి వైఎస్సార్ యంత్ర సేవా పథకం ద్వారా సబ్సిడీతో మంజూరైన ట్రాక్టరు, రొటోవేటర్, బండ్‌ఫార్మర్‌ను అందించారు. శాసనకోట రైతు భరోసా కేంద్రం పరిధిలో ధాన్యలక్ష్మీ రైతుమిత్ర గ్రూప్‌కు ప్రభుత్వ సబ్సిడీతో మంజూరైన మినీ ట్రాక్టర్, రొటోవేటర్, పవర్‌వీడర్ పరికరాలను ఏడీసీసీ బ్యాంకు మేనేజర్ లక్ష్మీరెడ్డితో కలిసి పరిశీలించారు. ఆయా కార్యక్రమాల్లో ఆర్బీకే సిబ్బంది హరీష్, పవన్, రైతులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాల తనిఖీ



గౌరాజుపల్లిలో మూతపడిన అంగన్‌వాడీ సెంటర్ వద్ద ఎంపీడీఓ రాబర్ట్‌విల్సన్

రొద్దం: మండలంలోని పలు అంగన్‌వాడీ కేంద్రాలను గురువారం ఎంపీడీఓ రాబర్ట్‌విల్సన్ ఆకస్మిక తనిఖీ చేశారు. రొద్దంలో మూడు అంగన్‌వాడీ సెంటర్ల తెరవకుండా కార్యకర్తలు విధులకు డుమ్మా కొట్టినట్లు ఎంపీడీఓ తెలిపారు. గౌరాజుపల్లి, ఆర్ మరువపల్లి అంగన్‌వాడీ కేంద్రాలను వెళ్లగా సెంటర్లు మూసి వేసినట్లు చెప్పారు. రెడ్డిపల్లిలో సెంటర్ తెరిచినా నాలుగు రోజులుగా పిల్లలు హాజరు కాలేదన్నారు. అంగన్‌వాడీ వర్కర్లు తప్పకుండా విధులకు హాజరుకావాలని లేని పక్షంలో వారిపై చర్యలు తీసుకుంటామని చెప్పారు.

పనులు నాణ్యతగా చేపట్టాలి

రొద్దం: ఉపాధి పనుల్లో నాణ్యత ఉండేలా చేయాలని ఎంపీడీఓ రాబర్ట్‌విల్సన్ కూలీలకు సూచించారు. గురువారం గౌరాజుపల్లి గ్రామ పరిధిలో జరుగుతున్న ఉపాధి పనులను ఎంపీడీఓ తనిఖీ చేశారు. కూలీల సంఖ్య, మస్టర్‌ను పరిశీలించారు. పనుల్లో నాణ్యత ఉంటేనే రోజుకు రూ.272 కూలి పడుతుందన్నారు. పనులపై కూలీలతో ఆరాతీశారు. ఎండలు ఎక్కువగా ఉండడంతో ఉదయం 6 గంటలకే కూలీలు పనులకు వెళ్లాలని సూచించారు.

'నాడు-నేడు' పనుల పరిశీలన



విద్యాకానుక కిట్లను పరిశీలిస్తున్న అధికారులు

లేపాక్షి: మండలంలోని మామిడిమాకుల పల్లి, బయన్నపల్లి, లేపాక్షిలోని ఉర్దూ ఉన్నత పాఠశాలల్లో జరుగుతున్న నాడు-నేడు పనులను ఎంపీడీఓ నరసింహనాయుడు, ఎంఈఓ నాగరాజు, పంచాయతీరాజ్ ఈఏ హనుమేనాయక్ గురువారం ఉదయం పరిశీలించారు. పనులకు మంజూరైన నిధుల వివరాలు? ఇప్పటి వరకూ ఎంత మేర ఖర్చు చేశారని ఆరా తీశారు. పనులు నాణ్యతగా ఉండాలన్నారు. అనంతరం జగనన్న విద్యా కానుక కిట్లు, పాఠ్యపుస్తకాలను వారు పరిశీలించారు.

సీఎం జగన్‌తోనే పేదలకు న్యాయం

- 'గడప గడపకూ మన ప్రభుత్వం'లో ఎమ్మెల్యే తిప్పేస్వామి



మహిళలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే తిప్పేస్వామి

మడకశిర(అగళి): ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌తోనే పేదలకు న్యాయం జరుగుతుందని ఎమ్మెల్యే తిప్పేస్వామి అన్నారు. అగళి మండలంలోని పీబ్యాడిగెరలో గురువారం గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎమ్మెల్యే ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరించి బుక్‌లెట్ అందించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి కులమతాలు, రాజకీయాలకు అతీతంగా అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలను అందిస్తున్నారన్నారు. టీడీపీ హయాంలో సంక్షేమ పథకాలను పొందడానికి జన్మభూమి కమిటీల చుట్టూ తిరగాల్సిన పరిస్థితి ఉండేదని గుర్తుచేశారు. చంద్రబాబు ఇచ్చిన హామీలను గాలికొదిలేయగా వైఎస్ జగన్ హామీలు వంద శాతం నెరవేర్చారన్నారు. వచ్చే ఎన్నికల్లో ప్రతి ఒక్కరూ వైఎస్ జగన్‌కు అండగా ఉండాలని ఆయన విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో కుంచిటి వక్కలిగ కార్పొరేషన్ చైర్‌పర్సన్ నళిని, ఎంపీపీ రేణుక, కార్పొరేషన్ డైరెక్టర్ చంద్రప్ప, మండల కన్వీనర్ మహేంద్ర, ఎంపీడీఓ నరేంద్రకుమార్, ఎంపీటీసీ సురేష్, మార్కెట్ యార్డు చైర్మన్ జయరామప్ప, జేసీఎస్ కన్వీనర్ శివన్న, సర్పంచు నరసమ్మ, మధు, సచివాలయం సిబ్బంది, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు. అనంతరం ఎమ్మెల్యే కోడిపల్లి గ్రామాన్ని సందర్శించారు. ఎంపీపీ రేణుక, వైఎస్సార్‌సీపీ నాయకుడు కామరాజు, నాయకులతో సమావేశమై పార్టీ అభివృద్ధిపై చర్చించారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల అందజేత



పరిగి: సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను అందిస్తున్న ఎమ్మెల్యే మాలగుండ్ల శంకరనారాయణ

పరిగి: నియోజకవర్గంలోని పలు మండలాల్లో వివిధ అనారోగ్య కారణాలతో ఆసుపత్రిలో చికిత్స చేయించుకున్న బాధిత కుటుంబ సభ్యులకు ఎమ్మెల్యే మాలగుండ్ల శంకరనారాయణ సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు అందించారు. గురువారం పెనుకొండలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో 11 మందికి రూ.11 లక్షల చెక్కులను అందజేశారు. ఇందులో పరిగి మండలానికి చెందిన చెన్నయ్య గారి సురేష్, మమత, కె లలిత, పెనుకొండ మండలానికి చెందిన కురుబ చెన్నకేశవులు, సుగాలి నాగరత్నభాయి, కురుబ ఎల్లమ్మ, సోమందేపల్లి మండలానికి చెందిన ఉప్పర సుజాత, కె అనూరాధ, పార్వతి, కె ఉమ, రొద్దం మండలానికి చెందిన పి అన్నపూర్ణ ఉన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ నరసింహమూర్తి, రొద్దం ఎంపీపీ చంద్రశేఖర్, మండల కన్వీనర్ బోయ తిమ్మయ్య, సోమందేపల్లి మండల కన్వీనర్ నారాయణరెడ్డి, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

మృతుల కుటుంబాలకు ఎమ్మెల్యే పరామర్శ

రొద్దం: గోనిమేకులపల్లికి చెందిన వైఎస్సార్‌సీపీ నేత డిష్ చంద్రశేఖర్ తల్లి రత్నమ్మ అనారోగ్యంతో మృతి చెందడంతో గురువారం ఎమ్మెల్యే శంకరనారాయణ గ్రామానికి చేరుకుని రత్నమ్మ మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. మృతురాలి కుటుంబ సభ్యులకు పరామర్శించారు. అదేవిధంగా మండల కేంద్రంలో వలంటీర్ వినయ్‌కుమార్ తండ్రి వైఎస్సార్ సీపీ కార్యకర్త పోలేపల్లి గంగాధర్ రెండు రోజుల క్రితం ప్రమాదవశాత్తు చెరువులో పడి మృతి చెందాడు. దీంతో ఎమ్మెల్యే వలంటీర్ కుటుంబాన్ని పరామర్శించి రూ.10 వేలు ఆర్థిక సాయం అందించారు. కంచిసముద్రంలో వైఎస్సార్ సీపీ కార్యకర్త కె క్రిష్టప్ప గుండెపోటుతో మృతి చెందడంతో మృతుడి కుటుంబాన్ని పరామర్శించారు. మృతుడి కుటుంబానికి రూ.20 వేలు ఆర్థికసాయం అందించారు. శ్యాపురంలో వైఎస్సార్ సీపీ కార్యకర్త, ఎంపీటీసీ రమేష్ యాదవ్ వరసకు అన్న గొల్ల రంగప్ప గుండెపోటుతో మృతి చెందడంతో మృతదేహానికి నివాళులర్పించారు. మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించారు. మృతుల కుటుంబాలకు పార్టీ అన్ని విధాల అండగా ఉంటుందని ధైర్యం చెప్పారు. ఎంపీపీ చంద్రశేఖర్, స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ బి.నారాయణరెడ్డి, మండల కన్వీనర్ బోయ తిమ్మయ్య, ఆర్ లోచెర్ల సర్పంచు గంగాధర్, సింగిల్ విండో చైర్మన్ లక్ష్మీనారాయణరెడ్డి, సాంస్కృతిక విభాగం జిల్లా అధ్యక్షుడు జె. మారుతిరెడ్డి, సచివాలయాల సమన్వయకర్త ఆర్‌ఏ రవిశేఖర్‌రెడ్డి, నాయకులు నగరూరు నారాయణరెడ్డి, రాజ్‌గోపాల్‌రెడ్డి, వినయ్‌రెడ్డి, ఉజ్జినప్ప పాల్గొన్నారు.

ప్రజా సమస్యలపై దృష్టి సారించండి



మాట్లాడుతున్న ఎంపీడీఓ రామారావు

గుడిబండ: ప్రజా సమస్యలపై ఎంపీటీసీలు, సర్పంచ్‌లు దృష్టి సారించాలని ఎంపీపీ రాధమ్మ, జెడ్పీటీసీ భూతరాజు సూచించారు. గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ రాధమ్మ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ముందుగా సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు మాట్లాడుతూ కొంత మంది అధికారులు అవినీతికి పాల్పడుతున్నారని, వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. అలాగే సచివాలయ ఉద్యోగులు సమయపాలన పాటించేలా చర్యలు తీసుకోవాలన్నారు. స్పందించిన ఎంపీడీఓ మాట్లాడుతూ సమయపాలన పాటించని ఉద్యోగులపై చర్యలు తీసుకుంటామన్నారు. ఎంపీపీ మాట్లాడుతూ ప్రజా ప్రతినిధులు గుర్తించిన సమస్యలను అధికారులు ఎప్పటికప్పుడు పరిష్కరించాలని సూచించారు. ఉపాధి హామీ ద్వారా రైతులు పొలాలకు రహదారులు ఏర్పాటు చేసుకోవాలన్నారు. మండలంలో 52 పాఠశాలలు నాడు-నేడుకు ఎంపికయ్యాయన్నారు. ప్రభుత్వ నిర్ణయం మేరకు ప్రతి గ్రామ సచివాలయంలో రోజూ సాయంత్రం 3 గంటల నుంచి 5 గంటల వరకూ స్పందన కార్యక్రమం నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ రామారావు, డిప్యూటీ తహసీల్దార్ రాంభూపాల్‌రెడ్డి, ఈఓఆర్‌డీ నాగరాజునాయక్, వైస్ ఎంపీపీలు రవి, రత్నమ్మ, ఏఓ తిమ్మప్ప, ఏఈలు హరి, సుదర్శన్‌యాదవ్, ఏపీఓ భార్గవి, పంచాయతీ కార్యదర్శులు, అధికారులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.

22న కలెక్టరేట్ ముట్టడి

పెనుకొండ రూరల్: ఉపాధి హామీ కూలీల సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 22 శ్రీసత్యసాయి జిల్లా కలెక్టరేట్ ముట్టడి నిర్వహిస్తున్నట్లు వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి గంగాధర్ తెలిపారు. గురువారం మరువపల్లి, హనుమప్పపల్లిలో ఉపాధి కూలీలను కలిసి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. కలెక్టరేట్ ముట్టడిని జయప్రదం చేయాలని కూలీలను కోరారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు



బస్సు కిందకు దూసుకెళ్లిన ద్విచక్ర వాహనం

పావగడ: తాలూకాలోని గోరసమావు గ్రామ క్రాస్ వద్ద గురువారం చోటు చేసుకున్న రోడ్డు ప్రమాదంలో ఆ గ్రామానికి చెందిన తిమ్మయ్య గాయపడ్డాడు. ద్విచక్ర వాహనంలో గ్రామం నుంచి వస్తుండగా క్రాస్ వద్ద ఓ ప్రైవేట్ బస్సును ఢీ కొన్నాడు. ప్రమాదంలో అతడి తలకు తీవ్ర గాయమై స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. పోలీసులు సంఘటనపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

పర్యావరణ పరిరక్షణపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న దృశ్యం

సోమందేపల్లి: కాలుష్య నియంత్రణ కోసం పర్యావరణ పరిరక్షణ ఎంతో అవసరమని అటవీ శాఖ అధికారులు దివాకర్, శిరీష పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన మిషన్ లైఫ్ కార్యక్రమంలో భాగంగా గురువారం మండల కేంద్రంలోని వారపు సంతలో ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్లాస్టిక్ వాడకాన్ని పూర్తిగా ఆపేయాలన్నారు. ఇప్పటికే ఆహారం, వాతావరణం కాలుష్య కోరల్లో చిక్కుకుందన్నారు. భావితరాల కోసం పర్యావరణ పరిరక్షణకు ప్రజలు సహకరించాలని కోరారు. ఏఎస్ఐ మురళి, అటవీ శాఖ సిబ్బంది సోమశేఖర్ పాల్గొన్నారు.

ఘనంగా భద్రావతి భావనారుషీశ్వర గ్రామోత్సవం



స్వాముల ఉత్సవ విగ్రహాలను ఊరేగిస్తున్న దృశ్యం

తాడిపత్రి టౌన్ : స్థానిక యల్లనూరు రోడ్డు సమీపంలోని మార్కండేయస్వామి ఆలయంలో భద్రావతి భావనారుషీశ్వరుల కల్యాణ మహోత్సవాల్లో భాగంగా గురువారం రాత్రి అమ్మవారు,స్వామి ఉత్సవ విగ్రహాల గ్రామోత్సవం ఘనంగా జరిగింది. స్థానిక ఆలయం నుంచి సీబీరోడ్డు మీదగా యల్లనూరు రోడ్డు సర్కిల్, అంబేడ్కర్ సర్కిల్, గాంధీ సర్కిల్ వరకు గ్రామోత్సవం సాగింది. ఉదయం గణపతి హోమం, క్షీరాభిషేకం నిర్వహించారు. కార్యక్రమంలో బహుత్తమ పద్మశాలియ సంఘం గౌరవాధ్యక్షుడు జలదుర్గం దామోదర్‌దాస్, గౌరవ సలహాదారు వద్ది లక్ష్మీనరసయ్య, ధర్మకర్త చెన్నా సూర్యనారాయణ, అధ్యక్షుడు గడ్డం గణేష్, వైస్ ప్రెసిడెంట్స్ రంగప్రసాద్, రవికుమార్, జాయింట్ సెక్రటరీ గడ్డం పరమేష్, ప్రధాన కార్యదర్శి శంకర్, కోశాధికారి హరికృష్ణ, సభ్యులు పాల్గొన్నారు.

15 నుంచి కళాశాలలో ప్రవేశాలు

అమరాపురం: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఈ నెల 15 నుంచి మొదటి సంవత్సరం ఇంటర్ ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ సుజాత తెలిపారు. ఎంపీసీ, బైపీసీ, సీఈసీ, హెచ్ఈసీ, ఎంఈసీ గ్రూపుల్లో తెలుగు, ఇంగ్లిష్ మీడియంలో అడ్మిషన్లు చేసుకుంటామన్నారు. పదోతరగతి పాసైన విద్యార్థులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు. మరిన్ని వివరాలకు 6301917891, 7780556490, 9491854911 నంబర్లను సంప్రదించాలన్నారు.

ఆటో బోల్తా.. ఏడుగురికి గాయాలు

గుత్తి రూరల్: మండలంలోని కొత్తపేట గ్రామ శివారులో 44వ నంబర్ జాతీయ రహదారిపై గురువారం ఆటో అదుపు తప్పి బోల్తాపడిన ఘటనలో ఏడుగురికి గాయాలయ్యాయి. పోలీసులు, బాధితుల కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు.. తొండపాడు గ్రామానికి చెందిన సుంకప్ప తన మనుమరాలు మానవి కుల ధ్రువీకరణ పత్రం కోసం అభిరామ్, గంగోత్రి, లక్ష్మీదేవి, శ్రావణి, కార్తిక్‌తో కలిసి ఆటోలో గుత్తికి వచ్చారు. పని ముగించుకుని తిరిగి తొండపాడుకు వెళ్తుండగా కొత్తపేట సమీపంలో వేగంగా వెళ్తున్న ఆటో అదుపు తప్పి బోల్తా పడింది. ప్రమాదంలో గాయపడిన వారిని స్థానికులు గుత్తి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అనంతరం వైద్యుల సూచన మేరకు సుంకప్ప, అభిరామ్, మానవిని అనంతపురం ఆసుపత్రికి తీసుకెళ్లారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

గుడికట్టు మహోత్సవం రేపు



మాట్లాడుతున్న కురుబ సంఘం నేతలు

పుట్టపర్తి: ఈనెల 13వ తేదీన పుట్టపర్తి సాయి ఆరామంలో జరిగే కురుబల గుడికట్టు మహోత్సవానికి కురుబలు పెద్ద ఎత్తున తరలి రావాలని ఆ సంఘం నాయకులు పిలుపునిచ్చారు. గురువారం వారు బుక్కపట్నంలో విలేకరులతో మాట్లాడారు. పార్టీలకు అతీతంగా ఉమ్మడి జిల్లాల నుంచి కురుబలు హాజరు కావాలని సూచించారు. గౌరవయ్యలు, పూజారులుతో చర్చించి మహోత్సవం విజయవంతం అయ్యేలా చూడాలన్నారు. కురుబలు తమ పిల్లలను బాగా చదివించాలన్నారు. రాజకీయంగా ఎదగాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో సంఘం నేతలు సామకోటి ఆదినారాయణ, ఈశ్వర్, మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.

18న మండల సర్వసభ్య సమావేశం

సోమందేపల్లి: మండల పరిషత్ కార్యాలయంలో ఈ నెల 18న ఎంపీపీ గంగమ్మ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ వెంకటేశ్వర్లు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు, అన్ని శాఖల అధికారులు హాజరు కావాలని కోరారు.

రోజూ 'స్పందన' నిర్వహించాలి



సచివాలయాన్ని సందర్శించిన సబ్ కలెక్టర్ కార్తిక్

సోమందేపల్లి: గ్రామ సచివాలయాల్లో ప్రతి రోజు మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 5 వరకు స్పందన కార్యక్రమాన్ని నిర్వహించాలని సబ్ కలెక్టర్ కార్తిక్ సచివాలయ సిబ్బందిని ఆదేశించారు. గురువారం సాయంత్రం జూలకుంట గ్రామ సచివాలయాన్ని సబ్ కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. నిర్ణీత సమయంలోపు సిబ్బంది కార్యాలయంలో అందుబాటులో ఉండాలన్నారు. ప్రజల నుంచి వచ్చే వినతులను సకాలంలో పరిష్కరించాలని సూచించారు. ప్రభుత్వ పథకాలను సంబంధించి అర్హులు, అనర్హుల జాబితాను సచివాలయాల్లో తప్పక ప్రదర్శించాలని చెప్పారు. ఎంపీడీఓ వెంకటేశ్వర్లు, తహసీల్దార్ సౌజన్య లక్ష్మి పాల్గొన్నారు.

కూలీలందరికీ ఉపాధి పనులు



మెళవాయిలో పనులపై కూలీలకు అవగాహన కల్పిస్తున్న ఏపీఓ శ్రీకాంత్‌గౌడు

మడకశిరరూరల్: గ్రామ స్థాయిలో కల్పిస్తున్న ఉపాధి పనులను కూలీలు ఉపయోగించుకోవాలని ఏపీఓ శ్రీకాంత్‌గౌడు సూచించారు. గురువారం ఆయన మెళవాయి పంచాయతీలో జరుగుతున్న పనులను పరిశీలించారు. అనంతరం పనులపై కూలీలకు అవగాహన కల్పించారు. జాబ్‌కార్డు కలిగిన వారు పనులు ఉపయోగించుకోవాలన్నారు. వలంటీర్ల సహకారంతో కూలీల సంఖ్యను పెంచాలని సిబ్బందికి సూచించారు. పనుల చేసే చోట నీడ, తాగునీటి సౌకర్యం కల్పిస్తామన్నారు. బిల్లు ఆలస్యం చేయకుండా చెల్లిస్తామన్నారు. కార్యక్రమంలో ఉపాధి సిబ్బంది, కూలీలు పాల్గొన్నారు.

ముగిసిన శిక్షణ

అమరాపురం: స్థానిక వైఎస్సార్ క్రాంతి పథం కార్యాలయంలో నాలుగు రోజుల నుంచి ఆనిమేటర్లకు ఇచ్చిన శిక్షణ గురువారం ముగిసింది. ఏపీఎం తిప్పన్న మాట్లాడుతూ మండలంలోని మహిళా సంఘాల బలోపేతానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. అలాగే బ్యాంకు రుణాలు శ్రీనిధి రుణాలను మహిళా సంఘ సభ్యులు సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా అభివృద్ధి చెందాలని సూచించారు. గత మూడు రోజుల నుంచి ఇచ్చిన శిక్షణను గ్రామాల్లో మహిళా సంఘాలకు తెలియజేయాలన్నారు. లోకోస్ శిక్షణలోని అంశాలను వీఏఓలు అమలు చేయాలన్నారు. కార్యక్రమంలో సీసీలు, ఆనిమేటర్లు పాల్గొన్నారు.

నేడు మండల సమావేశం

అమరాపురం: స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో శుకరవారం ఉదయం 11 గంటలకు మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనునట్లు ఎంపీడీఓ మునిస్వామి ఎంపీపీ ఈరన్న గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. సమావేశానికి మండలంలోని ఎంపీటీసీలు, సర్పంచులు, కోఆప్షన్ సభ్యుడు, మండల స్థాయి అధికారులు హాజరు కావాలని వారు కోరారు.

ఇంటర్ ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

గుడిబండ: స్థానిక బీసీ బాలికల గురుకుల కళాశాలలో 2023-24కు ఇంటర్ ప్రవేశాలకు 10వ తరగతిలో ఉత్తీర్ణులైన విద్యార్థినుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ జ్యోతి గురువారం ఓ ప్రకటనలో కోరారు. ఆమె మాట్లాడుతూ ఇంగ్లిష్ మీడియంలో ఎంపీసీ 60, బైపీసీ 40, సీఈసీ 40 సీట్లు ఉన్నాయన్నారు. మే 18 లోపు రూ.250 ఆన్‌లైన్‌లో చెల్లించి దరఖాస్తు చేసుకోవాలన్నారు.మే 28న ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకూ ప్రవేశ పరీక్ష నిర్వహిస్తామన్నారు. మరిన్ని వివరాలకు 8978578111, 9989565658 నంబర్లను సంప్రదించాలన్నారు.

వైఎస్సార్ బీమా తక్షణ సాయం అందజేత

పరిగి: శ్రీరంగరాజుపల్లిలో ఇటీవల యూసూఫ్‌సాబ్(38) అనారోగ్యంతో మృతి చెందాడు. దీంతో వైఎస్సార్‌బీమా తక్షణ సాయం కింద రూ.10 వేలను గురువార సర్పంచ్ మల్లక్క, వైస్ సర్పంచ్ మురళీమోహన్‌రెడ్డి, ఎంపీటీసీ శ్రీనివాసులు, ఎస్సీ సెల్ నాయకుడు కిరణ్ మృతుడి భార్య షాహీనాకు అందించారు. కార్యక్రమంలో సచివాలయ సెక్రటరీ నజ్మా, వెల్ఫేర్ అసిస్టెంట్ గోవర్ధన్ పాల్గొన్నారు.

13న కౌంటింగ్

పావగడ: ఈ నెల 10న జరిగిన స్థానిక విధాన సభ క్షేత్రం ఎన్నికల కౌంటింగ్ ఈ నెల 13 న తుమకూరులోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో నిర్వహించనున్నారు. ఉదయం 8 గంటలకు కౌంటింగ్ ప్రారంభ మవుతుందని ఆర్వో అతిక్ పాషా గురువారం ఓ ప్రకటన లో పేర్కొన్నారు. పావగడతో పాటు మధుగిరి, కొరటగెరె, శిర విధాన సభ క్షేత్రాలకు సైతం అక్కడ కౌంటింగ్ జరుగుతుందన్నారు. కౌంటింగ్‌కు ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు.

రుణాలు రెన్యూవల్ చేసుకోండి

లేపాక్షి: స్థానిక ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకులో పంట రుణాలు తీసుకున్న రైతులు సకాలంలో రెన్యూవల్ చేసుకోవాలని బ్యాంకు మేనేజర్ జబివుల్లాఖాన్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 6వ తేదీ నుంచి రెన్యూవల్స్ ప్రారంభమయ్యాయన్నారు. ఈనెల 15 నుంచి 19వ తేదీ వరకూ కొండూరు, వడ్డిపల్లి, లక్కేపల్లి, 20 నుంచి 23వ తేదీ వరకూ లేపాక్షి, గొంగటిపల్లి, సోమిరెడ్డిపల్లి, కుర్లపల్లి గ్రామాలు, 24న గలిబిపల్లి, 25 నుంచి 30వ తేదీ వరకూ చిలమత్తూరు మండలంలోని దేమకేతేపల్లి, డి.గొల్లపల్లి, డి.ఓబుళాపురం, కొర్లకుంట గ్రామాలు, 30, 31 తేదీల్లో తమ్మినాయనిపల్లి, బ్రహ్మేశ్వరంపల్లి, గాద్రాలపల్లి, జూన్ 1న బింగిపల్లి, నాయనిపల్లి గ్రామాలు, 2వ తేదీ నుంచి 8వ తేదీ వరకూ కల్లూరు, మల్లిరెడ్డిపల్లి, భైరాపురం, 8 నుంచి 13వ తేదీ వరకూ ఉప్పరపల్లి, తిమ్మగానపల్లి, లక్కేపల్లి గ్రామాలకు చెందిన రైతులు రెన్యూవల్ చేసుకోవాలన్నారు.

బాబోయ్.. జింకలు!



జమ్మానిపల్లి సమీపంలో పొలాల్లో సంచరిస్తున్న జింకలు

మడకశిరరూరల్: మండలంలోని జమ్మానిపల్లి గ్రామ సమీపంలోని పొలాల్లో గుంపులు, గుంపులుగా జింకలు సంచరిస్తున్నాయి. ఉదయం సమయంలో పొలాల మీదుగా బుళ్లసముద్రం, గౌడనహళ్ళి, మణూరు, హరేసముద్రం పంచాయతీల్లోని పంటల్లోకి జింకలు వచ్చి నాశనం చేస్తున్నాయని రైతులు వాపోయారు. అటవీశాఖ అధికారులు స్పందించి జింకల బెడద నివారించాలన్నారు.